కొట్టింది. 'నా తప్పేంటి నాన్నా అమ్మని నే నుంచుకుంటా ననటం తప్పా? నిన్ను అడుగుదామనుకుంటే నువ్వు కాంపు కెళ్లావు. అమ్మని నే నుంచుకుంటానని అనటం తప్పని ఆ తర్వాత నాకు తెలిసిపోయింది అందుకని ఇవ్వాళ సాయంత్రం తమ్ముడితో నేను 'ఒరేయి తమ్ముడూ, నా తప్పు తెలిసిందిరా. అమ్మని నువ్వే వుంచుకో. నాన్నని నేనుంచుకుంటాను లేరా' అన్నాను. కానీ వాడు మాట మారిపోయాడు. 'కాదు నాన్నే నాకు కావాలి' అన్నాడు 'తప్పురా, కొట్టకూడదు పోన్లే నీమాటే వింటాను. నాన్ననే నువ్వు తీసుకో' అన్నాను. అయినా మళ్లీ కొట్టాడు. నే నెళ్లి అమ్మకి చెప్పాను. అమ్మ తమ్ముణ్ణి రెండు దెబ్బలు కొట్టింది వాడు డాబా మీదకు పారిపోయాడు.

"అమ్మ నన్ను మాత్రం బాగా కొట్టింది. 'వెధవల్లారా! బతికుండగానే మమ్మల్ని పంచుకుంటార్రా? అయినా ఆ బాబాయిల బుద్ధులే రావాలా మీకు, వెధవ బుద్ధులు! వాడికి లేకపోతే పెద్ద గాడిదవి నీ కుండక్కర్లా జ్ఞానం? నువ్వు పాడయింది కాకుండా వాణ్ణి కూడా పాడుచేస్తున్నావా? ఉండు. పొద్దున్నే నీకు అట్లకాడతో వాతలు పెట్టకపోతె చూడు! దెబ్బకి చచ్చూరుకుంటావ్? ముదనష్టపు వెధవా!' అంది.

"నా తప్పేంటి నాన్నా? నిన్ను ఉంచుకుంటా ననటం కూడా తప్పేనా నాన్నా?"

"ముసలా ళ్లయ్యాక అమ్మా, నువ్వా ఎటో వెళ్లిపోతే మేము ఏమయిపోతాం. అందుకని పంచుకోవా లనుకున్నాం. నేనూ, తమ్ముడూ ఒప్పుకుంటున్నాంగా! అమ్మ కెందుకు కోపం? వాతలు పెడితే నేను చచ్చిపోతానందిగా అమ్మ కెందుకు కోపం? అందుకనే నేను ఎటో వెళ్లిపోతున్నాను. తమ్ముడు కూడా వెళ్లిపోతాట్ట. ఈ రాత్రి అమ్మ దగ్గర పడుకుని పొద్దున్నే కాఫీ తాగాక వెళ్లిపోతాట్ట, ఇప్పుడు నాతో రా నన్నాడు

"అమ్మ తమ్ముడికి వాతలు పెడుతుందేమో, పెట్టొద్దని చెప్పవూ ! పాపం వాడి కసలేం తెలీదు!

ఇట్లు

నాన్నకు పెద్ద కొడుకు."

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 16-10-91)

★★★ ★★★ ★★★

# సై.. సై... సై..

" నీ పేరు విన్నా, నీ రూపు కన్నా ఉయ్యాల లూగు మది సైసైసై! నాకంట పడుతూ అందనివాడూ నీవని మనసూ వ్యధ చెందేనే, నీవైపు గాలీ నావైపు సోకీ ఉల్లాసమగు మది సైసైసై!"

పాతకేళ్ళ ధీరజాత వాకిట్లో ప్రహరీగోడ పక్కగా ఉన్నే సన్నజాజి పందిరి దగ్గర పూలు కోస్తూ సన్నగా కూనిరాగం తీస్తోంది

వాళ్లింట్లోనే మరోవైపు వాటాలో అద్దెకుంటున్న ఇంకో పాతికేళ్ళ యువకుడు జవనత్వం అదే సమయంలో గదిలో పేపరు చదువుకొంటూ కిటికీ లోంచి ధీరజాతను చూస్తున్నాడు. చూసి చూసి ఫక్కుమని నవ్వాడు. ధీరజాత కూడా అతన్ని చూసింది కిసుక్కుమంది. " పాట మారింది. కానీ మీ

గొంతు బాగుంది'' అన్నాడు జవసత్వం. నిట్టూర్చింది ధీరజాత- '' ఏం లాభం! ఫలించొద్దూ?'' అంది. ఈ ఇద్దర్నీ దూరంనించి గమనిస్తున్న ధీరజాత తండ్రి నారాచరావు అనుమానంగా చూస్తూ ముందు కొచ్చాడు '' లవ్వు సాంగ్సు తప్ప నోటి కింకేం రావా? పూలు ఇహ చాలు గాని లోపలి కెళ్ళు? '' అన్నాడు ధీరజాత తండ్రివైపు చిరాగ్గా చూస్తూ లోపలి కెళ్ళిపోయింది. నారాచరావు నెమ్మదిగా జవసత్వం గదిలో కొచ్చాడు. '' ఏంటయ్యా విశేషాలు? నీ పెళ్లి పప్పన్నం ఎప్పుడు పెడతావా అని ఎదురుచూస్తున్నానయ్యా!'' '' తప్పులేదు. చాలామంది చేస్తున్న పనే మీరూ చేస్తున్నారు. కానీ ఏం లాభం?'' నారాచరావు నవ్వబోయి ఆ వెంటనే కంగారుగా అన్నాడు, '' ఏం ఎవర్నయినా ప్రేమిస్తున్నావా, కొంపదీసి?'' కొంటెగా చూశాడు జవసత్వం. '' ఏం ప్రేమిస్తే?'' అన్నాడు.

'' ఆహఁ ఏం లేదు. ఈ రోజుల్లో పైపై మెరుగులకే భ్రమపడి, ఆ భ్రమలో తొందరపడి ఆ సాహసాన్నే ప్రేమనుకుంటున్నారు కుర్రకారు. నిజాని కసలు సాహసాన్ని ప్రేమించాలి గాని, ప్రేమించటంలో సాహసించకూడదు. కానీ అబ్బాయ్! ఒక్కోసారి మా అమ్మాయి లాంటి పిల్లలున్నారనుకో. వాళ్లని ప్రేమించటానికి వాళ్ళ దగ్గర ఏ సాహసమూ ఉండదు. ఆ మాటకొస్తే ఇంకా కన్నూముక్కూ పూర్తిగా మొలవని అర్భకపు సన్నాసులేగా వాళ్ళూ!''

జవసత్వం చురుక్కున చూశాడు . అన్నాడు '' అవునవును. అమ్మాయిల్లో ఏముంటుంది లెండి ప్రేమించటానికి! ఓ కిలో సాహసం కొనుక్కొని దాన్ని ప్రేమించటమే మంచిది. కానీ, మీరు ప్రేమించి పెళ్ళాడిన సాహసం మాత్రం ' న్యాకట్నం డబ్బు నికిస్తావా, ఇవ్వవా' అని ఇప్పటికీ మిమ్మల్ని జాడిస్తున్నట్టు రేపు నా కిలో సాహసం కూడా నన్ను జాడిస్తుందేమోనని నాభయం!'' ... '' అంటే ఏంటి నీ ఉద్దేశం?'' ... '' ఏముంది, ప్రేమించేటప్పుడే కొంచె జాగ్రత్తగా ప్రేమించటం మంచిది గదాని!''...'' అద్సరే, ఇప్పుడేవిటీ అన్నావు. నేను పెళ్లాడిన సాహసం నన్ను జాడిస్తోందా? లాభం లేదు నిన్నింక భరించలేను. మా ఇంట్లో వాళ్లతో ఎవరితోనయినా నువ్వికనుంచీ మాట్లాడావో సహించేదిలేదు. అసలు.. అసలు నాఇల్లు ఖాళీ చేసెయవయ్యా! వారం రోజులు టైమిస్తున్నాను. ఇదే ఫైనల్. మళ్లీమళ్లీ చెప్పను. తరువాత నీ ఇష్టం!'' కోపంగా చూస్తూ నారాచరావు విసవిసా వెళ్లిపోయాడు.

★ ★ ★

మళ్ళీ ఇంకో రోజున జవసత్వం వాకిట్లో స్కూటర్ తుడుచుకొంటూంటే ధీరజాత తీగెమీద బట్టలారేస్తూ కూనిరాగం తీస్తోంది.'' ఏప్రేమ నాన్నా కాదనినాడో ఆ వలపేల వాంఛింతునో, చేయి తగిలీ, నా ప్రేమ రగిలీ ఉద్దోలమగు మది సైసైసై.. నీపేరు విన్నా నీరూపుకన్నా ఉయ్యాల లూగు మదిసైసైసై!''

జవసత్వం అన్నాడు: '' ప్చ్ ఏమిటో మీ కోరిక ఎప్పటికి ఫలిస్తుందో గదా!'' .. '' ఎప్పటికో ఏంటి, ఇప్పుడు ఫలించొచ్చు! మా బావ సిద్ధంగానే ఉన్నాడు. ఎటొచ్చీ మా నాన్నే సైంధవుడు!''... '' మీ నాన్నగారు.. '' ...'' ఊఁ మా నాన్న. '' ..'' ప్చ్, మీ నాన్నాగారైపోయారు గానీ..'' ...'' లేకపోతే?'' .. ''ఇంకోరి నాన్న అయిపోయేవారుగదా! గొడవుండేది కాదు.''

'' ఫోండి బాబూ వెట్లు! అసలు మీరేదో దాస్తున్నారు చెప్పరా?''. '' ఆఁ మీకు తెలియందేముంది లెండి?! ఆయన మనిద్దర్నీ అన్యాయంగా అనుమానిస్తున్నారు నామీద ఫైరయిపోతున్నారు ''

“ తెలుసు. అదే నా క్కావలసింది ఈ కారణంగానూనా మాబావతో నాపెళ్లి జరిపించేస్తే ఎంత బాగుండును!” ...“ మరే, నన్ను ఖాళీ చేసెయ్యమనకుండా ఉంటే ఎంత బాగుండును? - సెంటర్లో ఇల్లు.” అదే సమయానికి గేట్లోంచి ఇంట్లో కొస్తున్న నారాచరావు వీళ్లిద్దర్నీ చూశాడు మండిపడిపోయాడు. కూతుర్ని ఇంట్లోకి తరిమాడు. జవసత్వంతో- “ పదీ రోజుల కిందట చెప్పాను. ఖాళీ చేసెయ్యమని. సరే, ఎల్లుండీపాటిగ్గాని ఖాళీ చెయ్యకపోయ్యావో వాటా తాళం వేసేస్తా నంతే. తరువాత నీఇష్టం!” అన్నాడు.

అర్థరాత్రివేళ జవసత్యం వాటాలోంచి వినిపించిని సుత్తి చప్పుళ్ళకి నారాచరావుకి మెలకువ వచ్చింది. చటుక్కున లేచొచ్చేశాడు- “ ఏవయ్యోయ్, ఏంటది?” అన్నాడు “ కిటికీ తలుపు బందుకి మేక్కొడుతున్నాను. ఎన్ని మాట్లు చెప్పినా మీరుబాగుచేయించట్లేదు. చలిగాలి ఆగట్లేదు. ఏం చెయ్యను?” ... “ ఏం చెయ్యక్కర్లేదు. వాటా నీ కిచ్చినప్పుడెట్లా ఉందో అట్లాగే ఉంచు. అసలు నువ్వు దయచెయ్. అదే పదివేలు” ... “ అనవసరంగా అనుమానం పెంచుకుని మీరు ఆవేశపడి నన్ను ఆరడి పెడుతున్నారు. ఒక్క ముక్క వినండి!”

“ ముక్క కాదు గదా అరముక్క కూడా వినను. నువ్వు దయచెయ్, దట్సాల్!” మర్నాడు మద్యాహ్నం జవసత్వం అబిడ్స్ ప్రాంతం అంతా వెతికి వెతికి చివరికి కనుక్కున్నాడు. పెంపుడు జంతువులమ్మే షాపు లోపలకెళ్లి అడిగాడు, “ నాకు నాలుగు పిల్లి పిల్లలూ, రెండు పందికొక్కులూ, ఇరవైఏడు ఎలుకలూ, రెండొందల ముప్పైతొమ్మిది బొద్దింకలూ అమ్మగలారా?”

షాపు యజమాని తెల్లబోయాడు.“ పిల్లి పిల్లల్నీ ఎలుకల్నీ ఉన్నన్ని ఇవ్వగలం. మిగతావి ఇవ్వలేం. అయినా పందికొక్కులూ , బొద్దింకలూ ఎందుకు?” అన్నాడు.

“ మా ఇంటి ఓనరు మొదట్లో తనిల్లు ఎట్లా ఉందో అట్లా తన కప్పగించీ మరీ నన్ను ఖాళీ చెయ్యమన్నాడు.” అన్నాడు జవసత్వం.

షాపు యజమాని నవ్వాడు. ఉన్నన్ని జంతువుల్నిచ్చాడు. వాటిని పట్టుకొచ్చి అర్థరాత్రి రహస్యంగా ఇంట్లో కొదిలాడు జవసత్వం. తక్షణం మొదలయ్యాయి- ఇంట్లో ఎలుకల పరుగులు, పిల్లులవేట, వంటింట్లో పడిపోయిన డబ్బా మూతల చప్పుళ్ళు వగైరాలు. రెండు రోజులు చూశాడు నారాచరావు. గ్రహించాడు జవసత్వాన్ని అడిగాడు , “ ఓ పక్క ఖాళీ చెయ్యమంటూంటే పిల్లుల్ని పెంచుతున్నావేంటి? పేచీ పెట్టుకోవాలని చూస్తున్నావా, అహఁ నాకు తెలీదులే!”... “ ఛ ఛ నేను పెంచటం ఏమిటండీ, పాత పిల్లి పిల్లలే మళ్ళీ వచ్చేసుంటాయి, స్వజాతి బాంధవ్యం వదులుకోలేక. ”... “ ఏంటీ, ఆర్నెల్ల కిందట నేను ఊరవతల దింపొచ్చిన పిల్లి పిల్లలు ఇంకా పిల్లలుగానే ఉన్నాయా?” ... “ ఏం ఎందుకుండవ్! బోన్సాయ్ అని మొక్కల పైకి ఎదక్కుండా ఉంచుతూ వాటిని పెంచే పద్ధతుంది గదా! ఇవ్వికూడా ఆ బోన్సాయ్ పిల్లలేనేమో!” .. “ నాన్సెన్స్! అయితే ఖాళీ చెయ్యవన్నమాట! చూస్కో ఏం చేస్తానో!” . “ ఏం చేస్తారు?” ... “ ఏం చేస్తానా మా కజినొకడున్నాడు పోలీసు. వాణ్ని పిలుచుకొస్తాను వాడు నీ టొపేరం లేపేస్తాడు. అప్పుడు గాని నీకు బుద్ధిరాదు” .. “ ఏంటీ, నాటొపేరం లేపేస్తారా? అయితే నేను మీ సొరేరం తన్నేస్తాను.” ... “ నా సొరేరం తన్నేస్తావా? సరే, చూస్కో!” కోపంతో ఊగిపోతూ వెళ్ళిపోయాడు నారాచరావు.

★ ★ ★

గేట్లో తారసపడ్డారు జవసత్వం , ధీరజాత " మీ నాన్నగారు పోలీసు సోదరుణ్ణి తీసుకొస్తార్ట!" జవసత్వం అన్నాడు " ఎందుకు" " ఏమో! బహుశా మనమీదున్న అనుమానం గురించి చెప్పటానికేమో!" " ఛత్!" ... " ఏమైనా మీ పరిస్థితిలో ఉన్న ఆడపిల్ల లెవ్వరూ మీలాగా నలిగిపోతూ కూర్చోరు ఏదో ఒక దోవ చూసుకుంటారు?"

ధీరజాత ఆలోచనలో పడిపోయింది. ఉండుండి- " ఐసీ!" అంది.

★ ★ ★

మర్నాడు సాయంత్రం ఓ పోలీసును వెంటబెట్టుకొచ్చాడు నారాచరావు వస్తూనే ఆ పోలీసు జవసత్వాన్ని - " ఏవయ్యా! మా అన్నగార్ని చంపేస్తానన్నావుట, లాకప్పులోగ్గాని పోవాలని హుషారుగా ఉందా?" అనడిగాడు. "ఛ!ఛ!, ఆయన నా టొపేరం లేపేస్తానన్నాడు గదాని నేను ఆయన సొరేరం తన్నేస్తానన్నానంతే గాని ఇట్లాంటి పెద్దమనిషిని చంపుకుంటామా!" ... "సొరేరం అంటే?"

" ఏమో నాకు తెలీదు" పోలీసు తికమక పడ్డాడు. నారాచరావు వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. తగ్గు స్వరంతో జవసత్వంతో అన్నాడు, " మనకీ మనకీ గొడవలెందుకు సార్! ఖాళీ చేసేసి హాయిగా ఇంకో ఇల్లు చూసుకోకూడదూ , అందరికీ బెస్టు!"

ఇంతలో నారాచరావు భార్య గోలుగోలున ఏడుస్తూ వచ్చింది. చేతిలో చీటీ ముక్కతో " కొంప మునిగిందండోయ్! అమ్మాయి ఆత్మ హత్య చేసుకుందిట! పొద్దుట్నుంచీ కనిపించకపోతే ఏ ఫ్రెండింటికన్నా వెళ్ళిందేమో అనుకున్నా ఇప్పుడు కనబడింది. ఈ చీటీముక్క! నా ఇంటిదీపం నూతిలో పడితే నేనెట్టా బతికేదిరా నాయనోయ్! నేనెందులో పడా(ౖలా దేవుడోయ్?"

అంతా అవాక్కపోయారు. ఆమె చేతిలోంచి చీటీముక్క తీసుకుని చదివాడు. జవసత్వం " ఈ ఆరళ్ళు భరించలేను. నా కోసం వెతక్కండి. నేనిక మీకు దక్కను. నా కికగొట్టంబావుల దగ్గర దిగుడు బావే దిక్కు! ధీరజాత." జవసత్వం నవ్వాడు. అన్నాడు! " అచ్చంగా చచ్చిపోయేవాళ్లు అడ్రసిచ్చి చావరమ్మా! కంగారు పడకండి. అన్నట్టు గండిపేట గొట్టం బావుల కంపెనీలోనేగా మీ అల్లుడు। అదే కాబోయే అల్లుడు। పని చేసేది!"

" అవునవును" అందామె ఏడుపాపి. ఉగ్రుడయ్యాడు నారాచరావు. " వాడా నా క్కాబోయే అల్లుడు? ఛీఛీ. వాడి పేరెత్తకండి. పైసా ఆస్తి లేని పిల్లికళ్ళ వెధవ !" వాకిట్లో ఆటో చప్పుడైంది ధీరజాత తన బావతో సర్రునొచ్చిచ తల్లి కాళ్ళమీద పడిపోయింది " పొద్దున్నే గండిపేట గుళ్ళో కొంగులు ముడేసుకున్నాం. క్షమించు. దీవించు. నోటితో చెబితే గాని లేవం" అంది. ఆమె ఆ ఇద్దర్నీ క్షమించి దీవించింది. నారాచరావు అగ్నిగుండమే అయిపోయాడు ఇంట్లో కెళ్ళి పోబోయాడు. అతన్ని గుంజుతూ ఆమె- " చాల్లెండి నిర్వాకం పాతికేళ్ళ పిల్లకి పెళ్లి మనం చెయ్యలేకపోగా, అది చేసుకుంటే చూసి ఆనందిచటం పోయి అక్కసొకటా మొహానికి !" అంది

జవసత్వం ధీరజాతను ఓరగా చూస్తూ అన్నాడు, " మీ అమ్మగారు చాలా అదుర్దా పడిపోయారు ఇట్లాగటండీ చేసేది?" ధీరజాత తల్లి - " ఎంత పని చేశావే మా తల్లీ! నీ కోరికేదో గట్టిగా నాకు చెప్పుంటే ఈ పెళ్ళి నేనే జరిపించుండేదాన్ని గదే! ఇంతకీ గండిపేటలో దిగుడుబావి ఎక్కడుందిట "